ముఖ్యమంత్రిని చంపాలి!

టెంపోరావ్

పన్నెండు దాటింది. అందరూ ముందు హాల్లో కూర్చుని వున్నారు. గోడకు జార్లాబడి గచ్చునేల మీద కూర్చు న్నారు.

తల్లి రత్నమ్మ. ఇద్దరు కొడుకులు. ముగ్గురు కూతుళ్ళు. అందరికంటే పెద్దవాడు రవి కళ్ళు మూసుకుని వున్నాడు.

"రవీ, నిన్న తిండిలేదు. ఇవాళ యేదో తినకపోతే వీళ్ళందరూ చస్తారురా!" అంది తల్లి.

తల్లి మాటలు విని రవి తృళ్ళిపడ్తూ లేచి నుంచు న్నాడు. తల్లివంక ప్రేమతో చూశాడు.

"అమ్మా, నేను వెళ్ళి యేదేనా తెస్తాను" అని అతను బయటకు నడిచాడు.

తల్లి అతడి వెనుకనే వెళ్ళింది, గొడ్డుదాకా.

"ఎక్కడి నుంచి తెస్తావురా?"

"నా స్నేహితులను అప్పడిగి తీసుకొస్తాను" అన్నా డతను.

"దిన దిన గండంగా యీ జీవితం ఎంత కాలం గడ వాలో!" అందామె.

అతడు విచారవదనంతో రోడ్డమ్మట నడిచి వెళ్ళి పోయాడు.

రవి బి. ఎ. పాసవగానే తండ్రి మరణించాడు. అతడు ఉద్యోగం కోసం ఎంతగానో ప్రయత్నం చేశాడు, కాని ఎక్కడా ఉద్యోగం చిక్కలేదు. రెండేళ్ళు గడిచి పోయాయి. ఆ రెండేళ్ళలోనూ తండ్రి చనిపోయాక వచ్చిన డబ్బు, తల్లి నగలు, యింట్లోని విలువైన వస్తువులు, అన్నీ ఎగిరిపోయాయి.

ఆలోచిస్తూ రవి తన స్నేహితుడైన వెంకట్ ఇంటికి వెళ్ళాడు. వెంకట్ యింట్లోనే వున్నాడు. గేటుముందు నిలబడి అతడు రవితో మాట్లాడాడు.

"రవీ, యేమిటి సంగతి?" అడిగాడతను.

"నాకు పది రూపాయిలు కావాలి!"

"నా దగ్గరున్న ఆఖరి పది రూపాయిల నోటును వీర్రాజు కిచ్చేశాను, అరగంట క్రితం."

"ఎంతుంటే అంతే యియ్యి!"

"నా జేబులు ఖాళీ! నువ్వే చూసుకో!" అన్నాడు వెంకట్.

"ఒక రూపాయి యిచ్చినా ఫరవాలేదు."

"మై డియర్ ఫ్రెండ్, ఒక పైసా కూడా లేదు. వచ్చేవారం దాకా నాన్న నాకు పాకెట్ మనీ ఇవ్వడు" అన్నాడు వెంకట్.

కోటీశ్వరుని కొడుకు వెంకట్ అలా అంటే తనకీ లోకంలో డబ్బెవరు యిస్తారు? మరో ఫ్రెండ్ ఇంటికి వెళ్ళడం వృథా అనిపించింది రవికి.

అతడు రోడ్డమ్మట నడిచి వెళ్ళిపోయాడు. రత్నా స్టోర్స్ ముందుకు వెళ్ళి ఆగాడు, మోడర్న్ బ్రెడ్, బ్రిటానియా బ్రెడ్లు యెన్నో ముందు టేబిల్ మీద వున్నాయి.

రవి అమాంతంగా రెండు బ్రెడ్ పాకెట్లను తన చేతిలోకి తీసుకున్నాడు.

"మొత్తం 4-20 అవుతుంది" అన్నాడు రత్నప్ప సెట్టి.

"చిల్లరుందా?" అడిగాడు రవి.

"ఎంతకి?"

"నూరు రూపాయిల నోటుకి."

"నోటు మార్చి డబ్బు పట్రా!" అన్నాడు సెట్టి.

అతడి మాటల్ని వినకుండా రవి పరుగెత్తాడు.

"వాడిని ఆపండి!" అర్చాడు సెట్టి.

రోడ్డమ్మట రవి పారిపోతున్నాడు. సెట్టి బయట కొచ్చి వెనకనే పరుగెత్తసాగాడు.

చాలా దూరంలో వున్నాడు రవి. కొంతదూరం పరుగెత్తి రత్నప్పసెట్టి ఒగురుస్తూ ఆగాడు. కడివెడు పొట్ట కిందకు జారింది. అతడు కదలలేక రోడ్డు వారగా కూర్చుండిపోయాడు.

"దొంగ ముండాకొడుకు. రెండు బ్రెడ్లు పట్టుకు పారిపోయాడు. పోలీసు రిపోర్టిచ్చి వాడికి బుద్ధి చెప్పిస్తాను" అర్చాడు సెట్టి.

రవి తన యింటికి చేరుకున్నాడు. రెండు బ్రెడ్లూ తల్లికి యిచ్చాడు.

"ఇవి కాల్చి వాళ్ళ కియ్యమ్మా" అన్నాడతను.

బ్రెడ్లను కాల్చవలసిన అవసరం లేకుండాపోయింది.

దాన్ని లాక్కొని పిల్లలు ఆకలితో తినేశారు. తల్లికీ, రవికీ ఒక్క స్లయిస్ కూడా మిగల్లేదు.

రెండు బ్రెడ్లూ తిని, మంచినీళ్ళు తాగి పిల్లలు నేల మీద పడుకున్నారు.

రవి తల్లి వంక దుఃఖంతో చూశాడు.

"నువ్వు తినలేదమ్మా!" అన్నాడతను.

"నా పిల్లలు తింటే నా ఆకలి తీరినట్లే" అందామె.

"అమ్మా!" అని అతడు ఏడ్వసాగాడు.

2

పదివేలమంది అక్కడ గుమి గూడారు. ముఖ్యమంత్రి విజయచంద్రన్ అనేకమంది పేదవాళ్ళకు కళ్ళజోళ్ళు యిస్తున్నాడు. ముఖ్యమంత్రి వెనక అతడి పెర్సనల్ సెక్యూరిటీ గార్డు సబ్‌యిన్‌స్పెక్టర్ దేవర్ నిలబడి వున్నాడు.

కామరాజు సూటిగా ముఖ్యమంత్రివైపు చూశాడు. అతడి ఒళ్ళు మండుతోంది. రక్తం వేగంగా ప్రవహిస్తోంది!

తనకు యిద్దరే కూతుళ్ళు!

వాళ్ళిద్దరూ పోలీసుల కాల్పులకు బలైపోయారు. కాలేజీకి వెళ్ళినవాళ్ళు యింటికి తిరిగిరాలేదు. గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళి తన కూతుళ్ళ శవాల వంక కామరాజు చూశాడు. రెండు శవాలూ వికృతంగా వున్నాయి. ఎంతో సాధస్తానుకొన్న అతడి కూతుళ్ళు క్షణంలో మరో లోకానికి చేరుకున్నారు.

ముఖ్యమంత్రి ఆదేశంమీద కాలేజీ ముందు పోలీసులు కాల్పులు సాగించారు. అతడి కూతుళ్ళిద్దరూ కాల్పులకు బలయిపోయారు.

కామరాజు కొంచెం దూరంలో నిలబడి ముఖ్యమంత్రి వైపు చూస్తున్నాడు.

విజయచంద్రన్ నవ్వుతూ అనేకమందికి బహుమతులు యిస్తున్నాడు.

కామరాజు సిగరెట్ వెలిగించాడు. పొగ పీల్చి, వదుల్తూ అతడు ముఖ్యమంత్రివంక చూశాడు.

ఆ రోజున షూట్ చేయవలసిన అవసరం యేముంది? ముఖ్యమంత్రి ఎందుకు ఫైర్ చేయమన్నాడు?

కామరాజు మెదడులో ఆలోచనలు తిరుగుతున్నాయి. తన కూతుళ్ళ శవాలను చూశాక కామరాజు ముఖ్య మంత్రిని కల్సుకున్నాడు.

"నా కూతుళ్ళిద్దరూ ఆనాటి ఫైరింగ్ లో మరణించారు!" అర్చాడతను.

ముఖ్యమంత్రి అతడి భుజంమీద చెయ్యి వేశాడు.

"కామరాజుగారూ, నన్ను క్షమించండి! ఆ నాటి షూటింగ్ లో యిరవై మంది చనిపోయారు. మీ అమ్మాయిలను చంపాలనే ఉద్దేశంతో నేను షూట్ చేయమన లేదు. స్టూడెంట్లందరూ ఆనాడు బస్సులమీదకు రాళ్ళు విసిరారు. ఎన్ని కార్లనో కాల్చేశారు. అది ఆపడం కోసం షూటింగ్ జరిగింది" అన్నాడు ముఖ్యమంత్రి.

ముఖ్యమంత్రి ముందు కామరాజు ఎక్కువగా మాట్లాడ లేకపోయాడు. కాని కామరాజు మనసులో ముఖ్యమంత్రి విజయచంద్రన్ హంతకుడిలా నాటుకుపోయాడు!

ముఖ్యమంత్రి వెళ్ళిపోయాడు. కామరాజు తన కారు వైపు నడిచాడు. కారులో కూర్చుని, తలుపుమూసి అతడు సిగరెట్ వెలిగించాడు. కొంతసేపు తన జీవితం గురించి ఆలోచిస్తూ వుండిపోయాడు.

అతడు లక్షలు గడించాడు. కాని అతడికి వారసులు లేరు. ఇద్దరు కూతుళ్ళూ మరణించారు! తన భార్యకు మెనోపాజ్ వచ్చేసింది. ఆమె పిల్లలను కనలేదు!

అతడు కారును పోనిచ్చాడు. రైలుపట్టాల పక్కనున్న రోడ్డమ్మట అతడి కారు వెళ్తోంది.

రైలుపట్టాల మీద ఒకతను అడ్డంగా పడుకొని వున్నాడు. వెనుకనించి ఎలెక్ట్రిక్ ట్రెయిన్ వస్తోంది!

అతడు కారును ఆపాడు. రైలుపట్టాలవైపు పరుగెత్తాడు. పట్టాల మధ్య పడుకొన్న అతడిని బలవంతంగా పక్కకు లాగాడు.

"యూ ఫూల్, చస్తావా?" అన్నాడు కామరాజు.

"ఇలా జీవించడం కంటే చావడం మేలు" అన్నాడా యువకుడు.

ట్రెయిన్ చప్పుడు చేస్తూ వెళ్ళిపోయింది. కామరాజు ఆ యువకుడిని తన కారువైపు లాక్కువెళ్ళాడు. ముందు సీటుమీద కూర్చోబెట్టి తలుపు మూశాడు. అతడు వెళ్ళి స్టీరింగ్ వీల్ వెనక కూర్చున్నాడు.

కామరాజు కారును పోనిచ్చాడు.

"ఎవరు నువ్వు?"

"నా పేరు రవి" అన్నాడతను.

"ఎందుకు అలా చావాలని ప్రయత్నించావు?" అడిగాడు కామరాజు.

"బ్రతికుండి యేమీ చేయలేనపుడు చావడం మంచిదనిపించింది" అన్నాడతను.

"అంతా వివరంగా చెప్పు"

"తల్లీ, ముగ్గురు చెల్లెళ్ళూ, ఒక తమ్ముడూ నాకు వున్నారు. నేను పెద్దవాడిని. బి.ఎ. పాసయ్యాను. నా

కెక్కడా ఉద్యోగం దొరకలేదు. ఇంట్లో నా వాళ్ళు ఆకలితో బాధపడ్డం చూడలేక చావడానికి సిద్ధపడ్డాను."

"నువ్వు చస్తే వాళ్ళ బాధ తగ్గుతుందా? వాళ్ళకు తిండి దొరుకుతుందా?"

"వాళ్ల బాధను చూడకుండా మరో లోకంలో వుండొచ్చు!"

కొంతసేపు కామరాజు మాట్లాడకుండా కారును పోనిచ్చాడు. రోడ్డుదీపాలు వెలుగుతున్నాయి. ఒక హోటల్ ముందు అతడు కారును ఆపాడు.

"ఏదైనా తిందువుగాని రా!"

"నావాళ్ళు తింటేనే గాని నేను తినను!"

"నువ్వు తిని వాళ్లకు పట్టుకు వెళ్ళొచ్చు."

కారు దిగి యిద్దరూ లోపలకు వెళ్లాడు. విశాలమైన హాల్లో లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి.

ఒక టేబుల్ ముందు యిద్దరూ యెదురెదురుగా కూర్చున్నారు. బేరర్ రాగానే కామరాజు ఆర్డరిచ్చాడు.

ఎదురుగా కూర్చున్న రవి వంక అతడు చూస్తూ వుండిపోయాడు. ముఖ్యమంత్రి పెర్సనల్ సెక్యూరిటీ గార్డ్ దేవర్ కీ, రవికీ చాలా పోలికలు వున్నాయి!

"మీరు చాలా మంచివారిలా వున్నారు" అన్నాడు రవి, ఏదో అనాలని.

"మంచి వాళ్ళకు మంచివాడినే" అన్నాడతను క్లుప్తంగా.

"మీ గురించి చెప్పండి."

"తిండిలేక మీరు బాధపడ్తున్నారు. తినేవాళ్ళు లేక

నేను కుమిలిపోతున్నాను" అన్నాడు కామరాజు.

"మీకు పిల్లలు లేరా?"

"ఉన్నారు. నెల క్రితం జరిగిన పోలీస్ షూటింగ్ లో నా యిద్దరు కూతుళ్ళు మరణించారు. వాళ్ళ శవాలను పోలీసులు నాకు అప్పగించారు" అన్నాడు కామరాజు.

బేరర్ యెన్నో పదార్థాలను టేబుల్ మీద పెట్టాడు. పెద్ద పాకెట్ ను టేబుల్ మీద వుంచాడు.

"నువ్వు తిను. నేను కాఫీ మాత్రం తాగుతాను" అన్నాడు కామరాజు.

ఆకలితో రవి తినసాగాడు. బేరర్ తెచ్చిన వేడి కాఫీ తాగుతూ కామరాజు సిగరెట్ వెలిగించాడు. పొగ పీల్చి వదిలి అతడు రవివైపు సూటిగా చూశాడు.

"మీ యింట్లోని వాళ్ళు కష్టపడకుండా బతకాలంటే నెలకు ఎంత కావాలి?"

"ఏం చెప్పను సార్? ఎంతొస్తే అంతలోనే మనిషి జీవిస్తూ వుంటాడు."

"వెయ్యి చాలా?"

"వెయ్యి దొరికితే వాళ్ళు సుఖంగా జీవిస్తారు. ఏ బాధా వుండదు" అన్నాడు రవి.

"ఇటువైన ప్రతి నెలా నేను నీ తల్లికి వెయ్యి రూపాయలు యిస్తాను. నువ్వు పంపావని చెప్తాను."

అతడివైపు రవి ఆశ్చర్యంగా చూశాడు. "నేను ఏం చెయ్యాలి?"

అతడివైపు కామరాజు సూటిగా చూశాడు.

"ఆ పట్టాలమధ్య పడుకుని నువ్వు చావాలని అనుకున్నావుగా! చావడానికి మరో మార్గం నీకు నేను చూపిస్తాను. ఆ మార్గంలో వెళ్ళి నువ్వు చావొచ్చు."

రవి మంచినీళ్ళను గడగడ తాగేశాడు. ప్లేట్లన్నీ ఖాళీ అయ్యాయి. వేడి కాఫీ తాగాడు.

"నేను చెప్పినట్లు చేస్తావా?"

"చేస్తాను, సార్."

కామరాజు అతడికి ఒక సిగరెట్ యిచ్చి కాల్చుకో మన్నాడు. రవి సిగరెట్ వెలిగించాడు.

"ఆ మార్గం ఏమిటో చెప్పండి."

"ఆ పాకెట్ తీసుకో. కారులో మాట్లాడుదాం" అని కామరాజు బిల్లు చెల్లించాడు.

ఇద్దరూ కారువైపు నడిచారు.

3

కారు స్పీడుగా వెళ్తోంది.

"మీ యిల్లు ఎక్కడ?"

రవి చెప్పాడు.

"మొదట అక్కడికి వెళ్ళి ఈ పాకెట్‌ను యిద్దాం. తర్వాత మనం మాట్లాడుదాం."

పాతబడిన యింటిముందు కామరాజు కారు ఆపాడు.

"మా యిల్లు వెనక భాగంలో వుంది" అన్నాడు రవి.

"పాకెట్ ఇచ్చి వెంటనే రా. నీకోసం ఎక్కువసేపు నేను కూర్చోలేను" అన్నాడు కామరాజు.

పాకెట్ తీసుకుని రవి వెనకవైపుకు పరుగెత్తాడు. ముందు తలుపు తెర్చివుంది. అమ్మ, పిల్లలు హాల్లోనే వున్నారు. అందరూ అతడి చేతిలోని పాకెట్ వైపు ఆశతో చూశారు.

"అందరూ కడుపునిండా తినండి" అని పాకెట్ తల్లి కిచ్చాడు.

"ఏదేనా పని దొరికిందా?" తల్లి అడిగింది.

"తర్వాత చెప్తానమ్మా. నాకోసం ఒకరు కారులో కూర్చుని వేచి వున్నారు. వెళ్తాను" అని అతడు బయటకు పరుగెత్తాడు.

కామరాజు అతడివైపు చూశాడు.

"రవీ, ఈ వెయ్యిరూపాయిలూ నీ తల్లికి యిచ్చిరా! వచ్చేనెల మళ్ళీ యిస్తాను."

ఆనందంగా రవి మళ్ళా యింటికి పరుగెత్తాడు. తల్లి చేతికి నోట్లను యిచ్చాడు.

"వెయ్యి రూపాయిలమ్మా! ఇటుపైన మనకు యే బెంగాలేదు. నెల నెలా నీకు వెయ్యిరూపాయిలు ఇస్తాను. యిల్లు నడుపు!"

నోట్లమీదనుంచి ఆమె చూపు కొడుకు మీదకు వెళ్ళింది. ఆనందంలో ఆమె ఏడ్చింది. ఆమె కన్నీళ్ళను తుడిచాడతను.

"జీవితమంతా అమావాశ్యగా వుండదమ్మా. ఎప్పుడో పౌర్ణమి వచ్చితీరుతుంది!"

అతడు వేగంగా వెళ్ళిపోయాడు. తల్లి ఏదో అంది. పెద్ద చెల్లెలు ఏదో అడిగింది. ఆగి వాళ్ళకు జవాబిచ్చేందుకు అతడికి టైమ్ లేదు.

అతడు ముందు సీటుమీద కూర్చుని తలుపు మూశాడు. కామరాజు కారును పోనిచ్చాడు.

"నువ్వు యిటుపైన మీ ఇంటికి వెళ్ళవు?" అన్నాడు కామరాజు.

అతడు ఉలిక్కిపడ్డాడు.

"అమ్మ బెంగెట్టుకుంటుంది! నన్ను చూడకుండా ఆమె వుండలేదు!"

"బాగా తిండితిన్నాక వచ్చేమాటలివి! ఆ ట్రెయిన్

కింద నువ్వు పడి చచ్చివుంటే నీ తల్లి ఏం చేసేది?" ప్రశ్నించాడు కామరాజు గంభీరంగా.

రవి మాట్లాడలేదు. కామరాజు మాటలు అతడికి అర్థం కావడంలేదు.

"ఇటు పైన నీ పనిని నువ్వు పూర్తి చెయ్యాలి."

"ఆ పనేమిటో మీరు చెప్పలేదు!"

కారు వేగంగా రోడ్డమ్మట పోతోంది.

"ముఖ్యమంత్రి విజయచంద్రన్ని నువ్వు చంపాలి!"

రవి త్రుళ్ళిపడ్డాడు. అతడి గుండె దడదడలాడింది.

"ఆయన్ని నేనెలా చంపగలను సార్? ఆయనచుట్టూ యెందరో సెక్యూరిటీ గార్డ్సు వుంటారు. పిస్టల్ని నేనింత వరకూ చూడలేదు."

"అన్నిరకాల ఆయుధాలనూ నువ్వు చూస్తావు. నీకు ట్రెయినింగ్ యిప్పిస్తాను."

"ఆయన్ని చంపితే మనకేమొస్తుంది, సార్?"

"నీకు చావు సంభవిస్తుంది! నీవు చావాలనుకున్నావుగా? పోలీసులు నిన్ను కాల్చి చంపొచ్చు. లేకపోతే పట్టుకొని, నీమీద కేసుపెట్టి, తర్వాత నిన్ను ఉరి తీయొచ్చు. ఏ విధంగానైనా నువ్వు చస్తావు!"

"మరొకర్ని చంపడం నాకిష్టంలేదు, సార్."

"నీ తల్లీ, నీ చెల్లెళ్ళూ, నీ తమ్ముడూ కడుపునిండా తిని బతికి వుండాలంటే నువ్వు హత్య చేసితీరాలి! నువ్వు చంపకపోతే వాళ్ళు కష్టపడ్తారు. పైలక వెయ్యి వాళ్ళకు అందదు."

"మీరు చెప్పినట్లే చేస్తాను, సార్" అన్నాడు రవి మరేం గత్యంతరం లేక.

రోడ్డమ్మట కారు దూసుకుపోయింది.

4

పెద్ద మేడ.

తన గదిలో రవి కూర్చుని ఉన్నాడు. ఎదురుగా పెద్ద సోఫాలో ఉన్నాడు కామరాజు.

కామరాజు సన్నగా, పొడుగ్గా ఉంటాడు. తలమీది వెంట్రుకలు యెప్పుడో రాలిపోయాయి. చాలా పట్టుదల గల మనిషని అతడి మొహం చూస్తే అందరికీ తెలుస్తుంది.

కామరాజు ఎప్పుడూ సూటులో ఉంటాడు. చేతిలో యెప్పుడూ చందనపు కర్ర ఉంటుంది. అతడి బూట్లు మెరుస్తూ ఉంటాయి. దుస్తులంటే అతడికి యెంతో యిష్టం.

కామరాజు అతడివైపు చూశాడు.

"రవీ, ఈ ఆల్బమ్ చూడు!"

రవి ఆల్బమ్ చూస్తూ ఉండిపోయాడు. ఆఖరిదాకా చూసి అతడు కామరాజువంక తిరిగాడు.

"చాలా అందమైన యువతులు, సార్!" అన్నాడు రవి.

"ఈమె నా పెద్ద కూతురు జయ. ఈమె నా చిన్న కూతురు విజయ."

ఫోటోలన్నీ రంగుల్లో ఉన్నాయి.

"అంత అందమైన నా యిద్దరు కూతుళ్ళూ క్షణంలో మరణించారు. పోలీసుల తుపాకీ గుళ్ళకు బలైపోయారు. ఆనాడు షూట్ చేయడం పోలీసు కమీషనర్ కి యిష్టం లేదు. ముఖ్యమంత్రి షూట్ చేయమని ఆర్డరిచ్చాడు. అటుపైన షూటింగ్ జరిగింది."

"చాలా ట్రాజిక్ సార్" అన్నాడు రవి.

కామరాజు కళ్ళు ఆగ్రహంతో, కసితో ఎర్రబడ్డాయి.

"ఓట్లకోసం సంవత్సరం క్రితం ఈ ముఖ్యమంత్రి యింటింటికీ వెళ్ళాడు. పదవిలో పడగానే అతడి కళ్ళు పైకెళ్ళాయి. తనకు ఓట్లిచ్చిన ప్రజలను మర్చిపోయాడు. వాడికి బుద్ధి చెప్పాలి!" అర్చాడు కామరాజు.

అమాంతంగా కామరాజు సోఫాలోంచి లేచాడు.

"నాతో రా!" అన్నాడు.

రవి లేచి అతడితో వెళ్లాడు. ఒక పడగ్గదిలోకి ఇద్దరూ వెళ్ళారు. పరుపుమీద యాభై యేళ్ళ వయసులో వున్న స్త్రీ పడుకుని వుంది.

పచ్చటి శరీరం. ఆమె జుత్తు తెల్లబడింది. సమీపంలో నిలబడి రవి ఆమెవంక చూశాడు.

"ఈమె నా భార్య. కూతుళ్ళ శవాలను చూసి మూర్ఛపోయింది. ఇప్పుడు లేవలేరు. అలాగే మంచంమీద పడి ఉంటుంది. ఆమెకు మాట కూడా పోయింది!"

"అంతా విచారకరంగా వుంది, సార్."

"నా కూతుళ్ళు చావడానికి, ఈమె ఇలా అవడానికి కారకుదెవరు? వాడే, మన ముఖ్యమంత్రి విజయచంద్రన్ ఎంతమంది ప్రజలు చచ్చినా ఈనాటి నాయకులకు లెక్క లేదు. వాళ్ళకు కావలసింది వాళ్ళ పదవులు" అన్నాడు కామరాజు.

పరుపుమీద పడుకున్న స్త్రీ వాళ్ళిద్దరివైపు మౌనంగా చూసింది.

మెల్లిగా యిద్దరూ వెనక్కు తిరిగి రవి వుండే గదిలోకి చేరుకున్నారు. సోఫాలో కూర్చుని కామరాజు సిగరెట్ వెలిగించాడు. పొగ వదుల్తూ అతడివైపు చూశాడు.

"ప్రతి యుగంలోనూ దుష్టులను శిక్షించడానికి విష్ణువు

ఎన్నో అవతారాలు దాలుస్తాడు. ముఖ్యమంత్రిని చంపడం కోసం నువ్వు అవతరించావు. ఆత్మహత్యకు బలై పోకుండా అందుకే నిన్ను నేను కాపాడాను!"

ఏం చెప్పాలో రవికి తోచలేదు. మాట్లాడకుండా అతడు చెప్పింది వినసాగాడు.

"విజయచంద్రన్ చాలా కాలంనుంచి నాకు తెలుసు. అతడికి హృదయంలేదు. ఒక్క అడుగు ముందుకు వెళ్ళడం కోసం అతడు ఏదైనా చేస్తాడు" అన్నాడు కామరాజు.

విజయచంద్రన్ చాలా మంచివాడనీ, పేదవాళ్ళకు ఎంతో సేవ చేస్తున్నాడనీ అతడు విన్నాడు. కామరాజు చెప్పినదంతా వ్యతిరేకంగా వుంది. చాలామంది ప్రజలకు ముఖ్యమంత్రి విజయచంద్రన్ దేవుడితో సమానుడు.

"ఇవాళ రాత్రి ఒక మీటింగ్ ఉంది. ముఖ్యమంత్రి అక్కడికి వస్తాడు. నువ్వూ నేను ఆ మీటింగ్ కు వెళ్దాం" అని కామరాజు లేచి, గదిలోంచి బయటకు వెళ్ళి పోయాడు.

5

సోడియమ్ వాపర్ లైట్లు చక్కటి కాంతిని నలువైపులా వెదజల్లుతున్నాయి.

కారును ఒకచోట ఆపి, కామరాజు, రవి కొంత దూరం నడిచి, పేవ్ మెంట్ మీద నిలబడ్డారు. తనని యెవరూ గుర్తించకూడదని కామరాజు తన వేషాన్ని కొద్దిగా మార్చుకున్నాడు.

పోలీస్ జీవ్ వచ్చి ముందుకు పోయింది. ముఖ్యమంత్రి కారు వెనకనే వచ్చింది. పోలీస్ జీవ్ వెనకనే కారు ఆగింది.

ముందు సీటుమీద కూర్చున్న పెర్సనల్ సెక్యూరిటీ

గార్డు సబ్ యిన్‌స్పెక్టర్ దేవర్ కిందకు దిగి, వెనుక తలుపు తెరిచాడు.

ముఖ్యమంత్రి కిందకు దిగాడు. అతడికూడా నడుస్తున్నాడు సెక్యూరిటీ గార్డు దేవర్.

"ముఖ్యమంత్రితో నడిచే సెక్యూరిటీ గార్డును జాగ్రత్తగా గమనించు!" అన్నాడు కామరాజు అతడి చెవిలో.

ఎదురుగా వున్న ఒక పబ్లిక్ హాల్లోకి ముఖ్యమంత్రి ప్రవేశించాడు. రవిని కొంచెం వెనక్కు తీసుకెళ్ళాడు కామరాజు.

"నేను లోపలకు రాను. హాల్లోకి వెళ్ళు. ఆ సెక్యూరిటీ గార్డును బాగా గమనించు. త్వరగా తిరిగిరా!" అన్నాడతను.

రోడ్డుదాటి రవి రాజేశ్వరీ హాల్లోకి నడిచాడు. హాలు జనంతో నిండివుంది. ముఖ్యమంత్రి కూర్చుని ఉన్నాడు. అతడి వెనకనే నిలబడి ఉన్నాడు సెక్యూరిటీ గార్డు దేవర్.

రవి మెల్లిగా ముందుకు వెళ్ళాడు. సెక్యూరిటీగార్డు వైపు ఆశ్చర్యంగా చూశాడు. అతడు యూనిఫామ్‌లో ఉన్నా, అచ్చంగా తనలాగే ఉన్నాడు.

కొంతసేపయ్యాక రవి బయటకు కదిలాడు. పేవ్‌మెంటుమీద కామరాజు తారట్లాడుతున్నాడు. ఇద్దరూ కారువైపు నడిచారు.

"నువ్వు తెలుసుకున్న దేమిటి?"

"సెక్యూరిటీగార్డుకూ నాకూ బాగా పోలిక వుంది" అన్నాడు రవి.

ఇద్దరూ కారులో కూర్చున్నారు. కామరాజు కారును పోనిచ్చాడు.

“ఆ సెక్యూరిటీగార్డు స్థానంలో నిన్ను నేను ప్రవేశ పెట్టాను. అప్పుడు దగ్గరనుంచి ముఖ్యమంత్రిని చంపొచ్చు. ఒక్క బులెట్ తో ముఖ్యమంత్రి కుప్పలా కూలిపోతాడు.”

“అదెలా సాధ్యం సార్?”

కామరాజు గర్వంగా నవ్వాడు.

“ఈ లోకంలో సాధ్యంకానిది ఏమీ లేదు” అన్నాడు కామరాజు.

కారు యింటివైపు దూసుకుపోతోంది.

“మనం యింటికెళ్ళేసరికి ఒకతను మనకోసం వచ్చి, వేచివుంటాడు. అతడి పేరు క్రిపాల్ సింగ్. అతడు నీకు షూటింగ్ నేర్పుతాడు” అన్నాడు కామరాజు.

పోర్టికోలో కారు ఆగింది. ఇద్దరూ దిగారు. మోటర్ సైకిల్ మీద కూర్చున్న క్రిపాల్ సింగ్, దగ్గరకొచ్చి కామరాజుకు నమస్కరించాడు.

క్రిపాల్ సింగ్ యిండియన్ ఆర్మీలో పనిచేసి రిటైరయ్యాడు. ప్రయివేట్ గా ఒక షూటింగ్ క్లబ్ ప్రారంభించి అనేకమందికి షూటింగ్ నేర్పుతున్నాడు.

“కమ్ విత్ మి” అన్నాడు కామరాజు.

వాళ్ళు ముందు హాల్లోకి వెళ్ళారు. పెద్ద హాలు. గోడలకు ఆయిల్ పెయింటింగ్స్ ఉన్నాయి.

“మిస్టర్ క్రిపాల్ సింగ్, కూర్చోండి” అన్నాడు కామరాజు.

సోఫాలో అతడు కూర్చున్నాడు. పక్కనే చతికిల బడ్డాడు రవి. ఎదురుగా సోఫాలో కూర్చుని కామరాజు అతడివైపు చూశాడు.

"ఇతడు రామ్మూర్తి. యేయర్ కాడ్‌లో వున్న నా కాఫీ ప్లాన్ టేషన్స్‌కి మేనేజర్. ఇతడికి షూటింగ్ నేర్పాలి."

"నేర్పుతాను సాబ్. అదే నా పని" అన్నాడు క్రిపాల్ సింగ్.

"ఎక్స్‌పర్టు అవడానికి యెంత టైము పడ్తుంది?"

"ఆరు నెలలు చాలు, సార్."

"నెలలో అతడికి నేర్పాలి."

"అప్పుడు ఎక్కువ ఖర్చవుతుంది."

"ఎంత ఖర్చయినా ఫరవా లేదు."

"పదివేలి స్తే నెలలో యితడు యెక్స్‌పర్టు అవుతాడు."

"మీరు అడిగినదానికి రెండువేలు కలిపి పన్నెండు వేలు యిస్తాను" అన్నాడతను.

"చాలా థాంక్స్, సార్! మీరు యెంతైనా యివ్వగలరు" అన్నాడు సింగ్.

కామరాజు జేబులోంచి కొన్ని నోట్లు తీసి టీపాయ్ మీద పడేశాడు.

"12 వేలు తీసుకెళ్ళండి. వెంటనే వర్కు స్టార్టు చేయండి" అన్నాడు.

"రా భాయ్" అని క్రిపాల్ సింగ్ రవిని తనతో బయటకు తీసుకు వెళ్లాడు.

6

మోటర్ సైకిల్ వెనక కూర్చున్నాడు రవి. క్రిపాల్ సింగ్ మోటర్ సైకిల్‌ని విమానంలా పోనిస్తున్నాడు. రవి హడలిపోతున్నాడు.

"ఇంత స్పీడ్ దేనికి?" అర్చాడు రవి వెనకనించి.

క్రిపాల్ సింగ్ వెనక్కి చూశాడు. అతడి పొడుగాటి గడ్డం, మీసాలు కొట్టొచ్చినట్లు కనపడ్డాయి. కాని అతడి మాటలు రవికి వినపడలేదు. తను అన్నది కూడా అతను వినలేదేమో!

పట్నానికి దూరంగా ఒక తోటలో గుడిసె ముందు అతడి మోటర్ బైక్ ఆగింది.

బయట ఒక కుర్చీ పడివుంది.

"బైటో, భాయ్" అని అతడు లోపలకు పరుగెత్తాడు.

క్రిపాల్ పొడుగ్గా, లావుగా వుంటాడు. అతడు ధరించిన పాంట్, షర్ట్ లూజ్‌గా వున్నాయి. తలమీద తలపాగా, చేతికి రాగి కంకణం!

బయటనున్న పాత కుర్చీలో రవి కూర్చున్నాడు. తోట ఎవరిదోగాని అనేక రకాల చెట్లున్నాయి. ఆలోచిస్తూ రవి సిగరెట్ వెలిగించాడు.

సిగరెట్ అయిపోయినా క్రిపాల్ సింగ్ రాలేదు. అతడి కొడుకు ఒక గ్లాసులో టీ తెచ్చి యిచ్చాడు.

వేడి టీని రవి తాగేశాడు.

కాస్సేపట్లో క్రిపాల్ సింగ్ వచ్చాడు.

"భాయ్, నేను నీ గురువుని" అన్నాడతను.

"అవును, సార్" అన్నాడు రవి.

గుడిసెలో ఎలెక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి.

"ఇవాళ మంచిరోజని నిన్ను తీసుకువచ్చాను. చీకటి పడ్డాక షూటింగ్ నేర్పలేను. రేపు పొద్దుట యిక్కడకు ఏడింటికి రా!" అన్నాడు క్రిపాల్ సింగ్.

"అలాగే వస్తాను" అన్నాడు రవి.

"వెళ్ళేముందు ఈ పిస్టల్ చూడు! ఇదొక కంట్రీ

మేడ్ పిస్టల్. ఇందులో పెలెట్లు వున్నాయి. పన్నెండు సార్లు షూట్ చేయొచ్చు. ఈ ట్రిగ్గర్ నొక్కితే చాలు, పెలెట్ దూసుకుపోతుంది!"

రవి పిస్టల్ని తీసుకున్నాడు. ట్రిగ్గర్ నొక్కాడు. పెలెట్ నేలమీద పడింది.

"ఆ చెట్టువైపు షూట్ చేయి!"

రవి లేచి నిలబడ్డాడు. అతడు చూపించిన చెట్టువైపు షూట్ చేశాడు. పెలెట్ వెళ్ళి చెట్టు మ్రానుకు కొట్టుకుని చప్పుడైంది.

"ఫైన్! ఫైన్, నువ్వు షూటింగ్ ఎక్స్పర్టు అవుతావు. నాకు సందేహం లేదు" అన్నాడతను.

పెలెట్లన్నీ గాలిలో యెగిరిపోయాయి. ఎక్కడా చప్పుడు కాలేదు. రవి పిస్టల్ని అతడి కిచ్చాడు.

"ఇక్కడ నుంచి ఎలా వెళ్ళాలి?" అడిగాడు రవి.

"రెండు ఫర్లాంగులు నడిస్తే మెయిన్ రోడ్డు వస్తుంది. అక్కడ నుంచి బస్సులు దొరుకుతాయి. పట్నంలో యెక్కడికయినా వెళ్ళొచ్చు" అన్నాడతను.

అతడికి నమస్కరించి రవి బయటకు నడిచాడు. ఆలోచిస్తూ నడుస్తున్నాడు. తను యింటికి వెళ్ళి అమ్మనూ, పిల్లలను చూసి తర్వాత కామరాజు యింటికి వెళ్ళడం మంచిదనిపించింది.

మెయిన్ రోడ్డుమీద అతడు బస్సు యెక్కాడు. గంటలో అది తన యింటికి కొంచెం దూరంలో ఆగింది. బస్సు దిగి అతడు వడి వడిగా తన యింటివైపు నడిచాడు.

ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. రేడియో పాట వినిపిస్తోంది. అతడు హాల్లోకి వెళ్ళాడు. పిల్లలందరూ అమాం

తంగా అర్చారు అన్నయ్య వచ్చాడని!

ఆనందంతో వాళ్ళ అరవడం విని అతడు యెంత గానో సంతోషించాడు. తల్లి వచ్చి అతడిని కౌగలించు కుంది.

"ఎలా వున్నావురా?"

"బాగా వున్నానమ్మా. పెద్ద ఉద్యోగం. మా యజ మాని చాలా మంచివారు" అన్నాడతను.

"ఇవాళ యిక్కడే వుండిపో" అందామె.

"వెళ్ళాలి. యజమానితో చెప్పి మరోసారి వస్తాను" అన్నాడతను.

చెల్లెలు తెచ్చిన కాఫీని అతడు తాగాడు. అందరి తోనూ మాట్లాడి బయటకు నడిచాడు.

7

ఏర్ కండిషండ్ గదిలో కామరాజు, డి. ఎస్. పి. పింటో స్కాచ్ విస్కీ సేవిస్తున్నారు. పోలీసు డి. ఎస్. పి. పింటో మంచి నిషాలో వున్నాడు.

తాగుతూ మధ్యన వాళ్ళు చిప్స్, మటన్ చాప్స్ తింటున్నారు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

"మిస్టర్ పింటో, నీ సహాయం నాకు కావాలి." అన్నాడు కామరాజు.

"ఏం కావాలో చెప్పండి సార్" అన్నాడు పింటో.

"ముఖ్యమంత్రికి పెర్సనల్ సెక్యూరిటీ గార్డు దేవర్ వున్నాడు తెలుసుగా?"

"తెలుసు" అన్నాడతను.

"అతడిని గురించి నాకు పూర్తి వివరాలు కావాలి."

"అంతా కనుక్కుంటాను సార్."

కామరాజు నవ్వాడు.

"మీ అమ్మాయి పెళ్ళిని నువ్వు నాకు ఫోన్‌లో చెప్పావు. పెళ్ళికి యెంత ఖర్చవుతుంది?" అడిగాడు కామరాజు.

"నేను పెద్ద ఉద్యోగంలో వున్నాను. అందువలన లక్ష రూపాయిలు కావచ్చు" అన్నాడతను.

"మిస్టర్ పింటో, నీ కూతురి పెళ్ళి విషయం గురించి నువ్వు ఆలోచించకు. లక్ష రూపాయిలు కాష్‌గా నేను నీకు పంపుతాను."

అతడు ఉద్రేకంతో కామరాజు చెయ్యి పట్టు కున్నాడు.

"మిమ్మల్ని యీ జీవితంలో నేను మరువను!" అన్నా డతను.

లోలోపల పింటో ఆలోచిస్తున్నాడు. ఒక యువ కుడు తన కూతుర్ని ప్రేమించి, పెళ్ళాడబోతున్నాడు. కట్నాలూ, కానుకలూ ఎక్కువగా లేవు. ఇరవై ఐదు వేలలో పెళ్ళి ముగించవచ్చు. తతిమా డబ్బుతో తనొక యిల్లు కొనుక్కోవచ్చు. పెద్ద పెట్టున కామరాజు తనకు సహాయం చేస్తున్నాడు. ఈ సమయంలో తనొక యిల్లు కొనాలి!

తొమ్మిదింటికి డి. ఎస్. పి. పింటో తన జీప్‌లో వెళ్ళిపోయాడు. కామరాజు యింకా తాగుతూనే వున్నాడు.

రవి నవ్వుతూ గదిలోకి వచ్చాడు.

"హలో!" అన్నాడు కామరాజు.

సోఫాలో యెదురుగా రవి కూర్చున్నాడు.

"రేపు ప్రొద్దుట ఏడింటికి క్రిపాల్ సింగ్ దగ్గరకు వెళ్ళాలి" అన్నాడతను.

"వెళ్ళు! షెడ్లలో కార్లు, మోటర్ బైక్స్, స్కూటర్లు వున్నాయి. నీకు కావలసింది నువ్వు తీసుకో!" అన్నాడు కామరాజు.

"అలాగే సార్!" అన్నాడతను.

"ఇంత వరకూ నువ్వు క్రిపాల్ సింగ్ తో నే వున్నావా?"

రవి తడబడ్తూ వుండిపోయాడు.

కామరాజు అతడివైపు సూటిగా చూశాడు.

"నాతో నిజం చెప్పు!"

"రవి మాట్లాడలేదు.

నీ తల్లిని చూడ్డానికి వెళ్ళావా?"

"వెళ్ళాను, సార్. అమ్మను చూసి చాలా రోజులు అయింది" అన్నాడు రవి.

"నీ తల్లిని చూడాలని వుంటే నాతో చెప్పి వెళ్ళు. ముఖ్యమంత్రిని చంపబోయే వ్యక్తికి డిసిప్లిన్ వుండాలి" అన్నాడతను.

"ఇటుపైన అలాగే చేస్తాను, సార్."

కామరాజు విజిల్ చేశాడు. ఒక బాయ్ అతడి దగ్గర కొచ్చాడు. అతడితో యేదో చెప్పాడతను.

ఒక గ్లాసులో స్కాచ్ విస్కీ పోసి, సోడా కలిపి, ఐస్ వేసి అతడు రవికి ఇచ్చాడు.

"నాకు తాగే అలవాటు లేదు, సార్!" అన్నాడు రవి.

"నువ్వు చేయబోయే పనికి తాగుడు ఒక ఫ్రెండ్ లాంటిది. డ్రింకిట్!"

గ్లాసులోని విస్కీని అతడు కళ్ళు మూసుకుని గడగడ తాగేశాడు.

బాయ్ రవి గ్లాసును నింపుతూనే వున్నాడు. నాలుగు రౌండ్లు అయ్యాక రవి సోఫాలో పడుకొన్నాడు. ఇంకా తాగే స్థితిలో లేడు.

"అతడిని గదిలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టు" అన్నాడు కామరాజు బాయ్‌తో.

ఇద్దరు నౌకర్లు రవిని మోసుకుపోయారు. అతడి గదిలోని పరుపుమీద పడుకోబెట్టారు.

గ్లాసులోని విస్కీని తాగేసి కామరాజు తన భార్య గదిలోకి వెళ్ళాడు. పరుపుమీద ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

"మైడియర్, నువ్వు బాధపడకు! మన కూతుళ్ళను బలి తీసుకున్న ముఖ్యమంత్రి విజయచంద్రన్ త్వరలో చస్తాడు!" అన్నాడతను.

ఆమె మొహంలో యే భావం లేదు. అతడివైపు పిచ్చిదానిలా చూసింది.

నర్సు గదిలోకి వచ్చింది. అతడికి ఆమె నమస్కరించింది.

"ఎలా వుందీమె?" అడిగాడతను.

"మునుపటిలాగే, సార్!" అంది నర్స్.

అతడు లేచి దూరంగా కదిలాడు. గుమ్మంవైపు వెళ్లాడు. నర్స్ అతడి వెనకనే వెళ్ళింది.

"సార్!" అందామె.

అతడు ఆమెవంక చూశాడు.

"మీతో ఒక విషయం మాట్లాడాలి" అందామె.

"ఈ రాత్రి నా గదికి రా, మాట్లాడుదాం" అని అతడు వెళ్ళిపోయాడు.

టైమ్ పన్నెండు కావస్తోంది. ఎవరో తలుపును

తట్టారు. కామరాజు వెళ్ళి వెళ్ళి తలుపును తెర్చాడు.

ఎదురుగా నర్స్ మేరీ నిలబడి వుంది!

"కమిన్!" అన్నాడతను.

ఆమె లోపలకు వచ్చింది. ఆమెను సోఫాలో కూర్చో మన్నాడు. ఆమె కూర్చుంది.

"సార్!" అందామె.

"చెప్పు" అన్నాడతను.

"నాకు యిద్దరు చెల్లెళ్ళు వున్నారు. వాళ్ళను బాగా చదివించాలని నేను పెళ్ళి చేసుకోడం మానేశాను. నా చెల్లెలికి పెళ్ళి కుదిరింది. అది చెయ్యాలంటే నాకు కనీసం పదివేలు కావాలి. మీరు యెంతో కొంత సహాయంచేస్తే ప్రతినెలా అప్పు తీర్చుకుంటాను" అందామె.

"మిస్ మేరీ, నీకు పదివేలు ఇస్తాను. నీ చెల్లెలు పెళ్ళి చెయ్యి. ఇది అప్పుగా నేను నీకు యివ్వడంలేదు. నువ్వు నాకు యీ డబ్బు తిరిగి యివ్వనక్కర లేదు" అన్నాడతను.

ఆమె ఆశ్చర్యపోతూ వుండిపోయింది.

"మిస్ మేరీ, మంచిని పెంచడం ధర్మంగా నేను భావిస్తున్నాను" అన్నాడు కామరాజు.

మిస్ మేరీ యవ్వనంలో వుంది. తన గదికి రమ్మంటే అతడి కన్ను ఆమెమీద వుందని ఆమె అనుకుంది. కాని కామరాజు అటువంటివాడు కాదు!

సోఫాలోంచి ఆమె లేచింది. అతడిముందు నేలమీద పడి సాష్టాంగ నమస్కారం చేసింది.

"సార్, మీరు చాలా గొప్పవారు!" అందామె.

"చెల్లీ, గొప్పతనం ధనంలో లేదు. కల్చర్‌లో వుంది. నా భార్య అంటే నాకెంతో అభిమానం. ఆమెకు నే

నెన్నడూ అన్యాయం చెయ్యను" అన్నాడతను.

అతడు పదివేలు ఆమె కిచ్చాడు.

"పెళ్ళి బాగా జరగాలి. అంతే నాకు కావాలి! ఎవరు ఎక్కడ ఆనందంగా వున్నా నేను వాళ్ళతో ఆనం దిస్తాను" అన్నాడతను.

మిస్ మేరీ అతడికి నమస్కరించి వెళ్ళిపోయింది. ఆమె హేండ్ బాగ్ లో అతడిచ్చిన పదివేలు వుంది!

8

డి.ఎస్.పి. పింటో అతడి కెదురుగా కూర్చున్నాడు. కామరాజు అతడివైపు చూశాడు.

"దేవర్ గురించి అంతా కనుక్కున్నాను" అన్నాడు పింటో.

"వివరంగా చెప్పు!" అన్నాడు కామరాజు.

"దేవర్ ఒక్కగానొక్క కొడుకు. అతడి కింకా పెళ్ళి కాలేదు. అతడు తల్లితో జీవిస్తున్నాడు. ఆమె గుడ్డిది" అన్నాడు పింటో.

"ప్రొసీడ్!" అన్నాడు కామరాజు.

"దేవర్ ముఖ్యమంత్రికి దూరపు చుట్టం. అందువల నే అతడు పెర్సనల్ సెక్యూరిటీగార్డు అవగల్గాడు" అన్నాడు పింటో.

"మిస్టర్ పింటో, నువ్వు చెప్పినదంతా నాకు తర్వాత వుపయోగపడుతుంది" అన్నాడు కామరాజు.

"సార్, మీకు ఏం కావలసినా నేను చేస్తాను" అన్నాడు పింటో.

కామరాజు తన బాగ్ లోంచి కొన్ని నోట్లకట్టలను తీసి అతడిముందు టీపాయ్ మీద పడేశాడు.

"లక్ష రూపాయిలు" అన్నాడతను.

ఆ నోట్లను డి.ఎస్.పి. పింటో తన బాగ్‌లోకి చేర్చు కున్నాడు.

"సార్, మీరు చాలా సహాయం చేశారు. మీరు తప్పక మా అమ్మాయి పెళ్ళికి రావాలి" అన్నాడతను.

"తప్పకుండా వస్తాను" అన్నాడు కామరాజు.

డి. ఎస్. పి. పింటో అతడికి నమస్కరించి వెళ్ళి పోయాడు.

రవి అప్పుడే గదిలోకి వచ్చాడు. అతడివంక కామ రాజు సూటిగా చూశాడు.

"రవీ, ముఖ్యమంత్రి విజయచంద్రాన్ని చంపవలసిన టైము దగ్గరవుతోంది" అన్నాడు కామరాజు.

రవి మౌనంగా వుండిపోయాడు. ఎవర్నీ చంపడం అత డికి యిష్టంలేదు!

"రవీ, భయపడుతున్నావా?" అడిగాడు కామరాజు.

"నాకు భయంలేదు, సార్!" అన్నాడతను.

"నువ్వు షూటింగ్‌లో ఎక్స్‌పర్టు అయ్యావు. దేవర్ స్థానంలో నిన్ను తర్వలో చేరుస్తాను. అటుపైన నువ్వు ముఖ్యమంత్రిని హతమార్చాలి!" అన్నాడు కామరాజు.

రవి మెదడులో ఆలోచనలు తిరుగుతున్నాయి. ఇంత వరకూ ఎవరినీ చంపలేదు. ముఖ్యమంత్రిని ఎలా చంపడం? రవి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు!

బాయ్ రవికి విస్కీ యిచ్చాడు. రవి, కామరాజు ఆనందంగా విస్కీ సేవిస్తున్నారు.

"రవీ, ముఖ్యమంత్రిని మామూలుగా చంపకూడదు. అరడజన్ బులెట్లు అతడి దేహంలోకి వెళ్ళాలి. బతికే అవకాశం అతడికి ఉండకూడదు" అన్నాడు కామరాజు.

"అలాగే చేస్తాను, సార్" అన్నాడు రవి.

పన్నెండుదాకా యిద్దరూ తాగుతూనే ఉన్నారు. రవి కునికిపాట్లు పడుతున్నాడు. కామరాజు బాయ్‌ని పిల్చాడు.

"ఇతడిని తన గదికి తీసుకెళ్ళండి!" అన్నాడతను.

వాళ్ళు అతడిని తీసుకుపోయారు. కామరాజు చిరు నవ్వుతో తన భార్య గదిలోకి వెళ్ళాడు.

9

తెల్లారుజామున నాలుగింటికి యింటి ముందు కారు ఆగింది. స్టీరింగ్ వీల్ వెనక కామరాజు కూర్చుని వున్నాడు. రవి కిందకు దిగాడు.

వెళ్ళి ముందు తలుపుమీద తట్టాడు. కాస్సేపట్లో తలుపు తెరవబడింది.

ఎదురుగా వున్న దేవర్ వైపు రవి చూశాడు. పిస్టల్ని అతడివైపు గురిపెట్టాడు.

"చేతులు ఎత్తి నుంచో!" అరిచాడు రవి.

లుంగీ, బనియన్‌లో వున్న దేవర్ చేతులు ఎత్తాడు.

"మిష్టర్ దేవర్, వెళ్ళి బయటనున్న కార్లో కూర్చో!" అన్నాడు రవి.

"అలా చెయ్యకపోతే?" అడిగాడు దేవర్.

"నువ్వు చస్తావు!" అన్నాడు రవి.

దేవర్ కారువైపు నడిచాడు. ముందు సీటుమీద కూర్చుని తలుపు మూశాడు.

కామరాజు పిస్టల్ కొనని అతడి శరీరంమీద గుచ్చి పెట్టాడు.

"పిచ్చివేషాలు వేస్తే చస్తావు!" అరిచాడతను.

రవి కారు దగ్గరకు వచ్చాడు.

"సార్, మీరు అతడిని తీసుకుపోండి" అన్నాడు

రవి.

కామరాజు పక్కనున్న దేవర్ చేతులను నైలాన్ తాడుతో కట్టేశాడు.

"రవీ, నువ్వు సరైన తోవలో వెళ్తున్నావు. విజయం నీది" అన్నాడు కామరాజు.

రవి మాట్లాడలేదు. కామరాజు కారును పోనిచ్చాడు.

రవి ముందు తలుపు మూసి లోపలకు వెళ్ళాడు. ఒక గదిలో దేవర్ గుడ్డితల్లి పడుకుని వుంది. పక్క గదిలో వున్న పరుపు ఖాళీగా వుంది. రవి ఆ గదిలోకి వెళ్ళి పరుపుమీద పడుకున్నాడు.

కామరాజు వేగంగా పోనిస్తున్నాడు. దేవర్ అతడి వైపు చూశాడు.

"ఇదంతా నువ్వు యెందుకు చేస్తున్నావు? నీకు ఏం కావాలి?" అడిగాడు సబ్ ఇన్స్పెక్టర్ దేవర్.

"నాకు ముఖ్యమంత్రి కావాలి!" అన్నాడు కామ రాజు.

"ఆయన నీకు దొరికితే ఏం చేస్తావు?"

"అతడిని చిత్రవధ చేస్తాను. దుర్మార్గుడు విజయ చంద్రన్ చావాలి!" అర్చాడు రామరాజు.

దేవర్ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు. తనెలాగో బయటపడి ముఖ్యమంత్రిని కాపాడాలి!

కాని యెలా బయటపడ్డం? తన చేతులు కట్టబడి వున్నాయి. కట్లు తెగితేగాని అతడు ఏమీ చెయ్యలేడు!

ఒక యింటిముందు పోర్టికోలో కారు ఆగింది. కామ రాజు దిగి అతడిని దిగమన్నాడు.

"మిస్టర్ దేవర్, కొంతకాలంపాటు నువ్వు నా అతిథిగా వుండాలి" అన్నాడు కామరాజు.

దేవర్ని అతడు మేడమీదకు యీడ్చుకుపోయాడు. ఒక గదిలో అతడిని పడేసి, తలుపుమూసి తాళంవేశాడు.

10

రవి తెల్లారుజామున ఐదింటికి లేచాడు. హాల్లో ఎక్సర్‌సైజులు చేయడం మొదలెట్టాడు. పింటో అందించిన సమాచారం యిప్పుడు రవికి ఉపయోగ పడ్తోంది.

తల్లి లేచి తడుముకుంటూ వచ్చి గుమ్మంలో నిలబడింది.

"బాబూ" అని పిల్చింది.

అతడు ఆమె దగ్గరగా వెళ్ళాడు. చెయ్యి పట్టుకుని ఆమెను బాత్‌రూమ్‌లోకి తీసుకు వెళ్ళాడు. బినాకా పేస్టును బ్రష్‌మీద రాసి ఆమెకిచ్చాడు.

అతడు వెనక్కు తిరిగాడు.

"బాబూ!" ఆమె మళ్ళా పిల్చింది.

"ఏం కావాలమ్మా?" అడిగాడతను.

కొన్ని వారాలపాటు కాసెట్ల మూలంగా అతడు దేవర్ మాటలను విన్నాడు. అలాగే మాట్లాడ్డం నేర్చుకున్నాడు.

"నువ్వు నా బంగారు బిడ్డవు. నువ్వు లేకుండా నేను బతకలేను" అందామె.

"నేనుండగలనా!" అని అతను వెళ్ళిపోయాడు.

ఆమె మొహం కడుక్కుంది. ఆమెను తీసుకెళ్ళి హాల్లోని సోఫాలో రవి కూర్చోబెట్టాడు.

"నీ కంఠం మారిందిరా" అందామె.

"దగ్గు మూలంగా అయివుంటుంది" అన్నాడతను.

దగ్గుతూ అతడు వంటగదిలోకి వెళ్ళాడు. వేడి కాఫీ తెచ్చి అతడు తల్లికిచ్చాడు. అతను యెదురుగా సోఫాలో

కూర్చుని కాఫీ తాగాడు.

టైమ్ చూశాడు. ఆరు కావస్తోంది. ఏ టైమ్‌లోనైనా కాంతమ్మ రావచ్చు. ఇంట్లో అన్ని పనులూ చూసుకుంటుందామె. అతడు యింటికి తిరిగివచ్చిందాకా ఆమె యింట్లోనే వుంటుంది.

బీరువాలోని దేవర్ యూనిఫామ్‌తీసి అతడు బయట పెట్టుకుని స్నానానికి వెళ్లాడు. స్నానంచేసి యూనిఫాం ధరించాడు. అతడి బెల్టుకు అమర్చబడిన తోలుసంచిలో ఒక అమెరికన్ పిస్టల్ వుంది. ఆ పిస్టల్‌తో యిరవైనాలుగుసార్లు షూట్ చేయొచ్చు. తర్వాత దాన్ని మళ్లీ లోడ్ చెయ్యాలి.

అద్దంముందు నిలబడి రవి తన రూపాన్ని చూసుకున్నాడు. అచ్చంగా దేవర్‌లాగే వున్నాడతను. ఎవ్వరూ తనని చూసి అనుమానించరు!

తలుపును యెవరో తట్టారు. అతడు వెళ్ళి తలుపును తెర్చాడు. కాంతమ్మ అతడివైపు చూసింది.

“వెళ్ళు!” అన్నాడతను.

ఆమె లోపలకు వెళ్ళింది. అతడిని చూడగానే కాంతమ్మ మొహంలో యే అనుమానం లేదు. ఆమె వయస్సు యాభై పైన ఉంటుంది.

కొంతసేపయ్యాక రెండు ఆంలెట్లను తయారుచేసి కాంతమ్మ అతడికిచ్చింది. ఆంలెట్లు ఎంతో రుచికరంగా ఉన్నాయి. అతడు ఆకలితో తిన్నాడు. ఆమె మళ్ళీ కాఫీ యిచ్చింది. కాఫీ తాగాడతను. దేవర్‌కి సిగరెట్ కాల్చే అలవాటులేదు!

సరిగ్గా ఏడింటికి పోలీసు జీప్ వచ్చి యింటిముందు ఆగింది. అతడు తల్లి గదిలోకి వెళ్ళాడు. ఆమె పక్కనే

కూర్చున్నాడు. ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"జీప్ వచ్చింది, వెళ్దామా" అని బయటకు నడిచి జీప్ ముందు సీటుమీద కూర్చున్నాడు.

కానిస్టేబుల్ కన్నన్ జీప్‌ని పోనిచ్చాడు. జీప్ వేగంగా వెళ్తోంది. రవి ఆలోచిస్తూ చూస్తున్నాడు. ఎక్కువకాలం తను దేవర్‌గా నటించడం కష్టం! తన్ని యెవరో ఒకరు కనిపెట్టవచ్చు! తొందరగా తను పని ముగించాలి!

ముఖ్యమంత్రి విజయచంద్రన్ యింటిముందు పోలీస్ వాన్ వుంది. డజన్‌మంది సాయుధ పోలీసులు గేటు బయట కాపలాగా ఉన్నారు.

జీప్ లోపలకు వెళ్ళింది. కాంపౌండులో కొన్ని కార్లు ఆగినచోట ఆగింది. రవి దిగాడు. ముఖ్యమంత్రి కార్యదర్శి ఉండే గదిలోకి వెళ్ళాడు.

"నమస్కారం సార్" అన్నాడు రవి.

కార్యదర్శి పేపర్లు చూస్తూ అతడివంక తిరిగాడు. ఒక కాగితాన్ని అతడికి అందించాడు. ఆ కాగితంలో ఉన్నదంతా రవి చదువుకున్నాడు. పక్కనున్న తన గదికి చేరుకున్నాడు.

ఫాన్ స్విచ్ తిప్పి అతడు తన కుర్చీలో కూర్చున్నాడు. టేబులు సొరుగులు లాగి చూశాడు. యేవేవో పేపర్లు ఉన్నాయి.

ఇవాళ యెనిమిదిదాకా ముఖ్యమంత్రి యెక్కడికీ వెళ్ళడు. తను అంతవరకూ విశ్రాంతి తీసుకోవచ్చు! అతడు పాత పత్రిక చదువుతూ కాలక్షేపం చేయసాగాడు.

ఒక నౌఖరు నవ్వుతూ వచ్చాడు.

"పెద్దమ్మగారు మిమ్మల్ని రమ్మన్నారు" అన్నాడతను.

నౌఖరుతో అతడు వెళ్ళాడు. ముఖ్యమంత్రి తల్లి అతడివైపు నవ్వుతూ చూసింది. ఆమెను చూస్తూంటే రవికి తన తల్లి గుర్తొచ్చింది.

"గోపీ, యిడ్లీ తెచ్చి యితడికియ్యి" అందామె.

నౌఖరు గోపీ యిడ్లీ తెచ్చి యిచ్చాడు. కుర్చీలో కూర్చుని అతడు పెద్దమ్మను గురించి ఆలోచించసాగాడు. ఆమె దేవతలా ఉంది. నవ్వుతూ తనకు టిఫిన్ పెట్టించింది. ఆమె కొడుకును తను చంపాలి! అది వీలవుతుందా? తను ముఖ్యమంత్రిని చంపగలడా?

నిమిషాలు గడిచిపోతున్నాయి. అతడు ఆలోచిస్తూనే ఉన్నాడు. టైం ఎనిమిది కావస్తోంది. ముఖ్యమంత్రి కారొచ్చి ఇంటిముందు ఆగింది. మెల్లిగా రవి కారువైపు నడిచాడు.

11

తాళంతీసి, తలుపు తెరిచి కామరాజు లోపలకు వెళ్ళాడు. టిఫిన్ ప్లేటును టీపాయిమీద పెట్టాడు. దేవర్ వైపు అతడు సూటిగా చూశాడు.

"టిఫిన్ తిను!" అన్నాడు కామరాజు.

అతడు టిఫిన్ ప్లేటును అందుకున్నాడు.

"నేనిక్కడ ఎంతకాలం ఉండాలి?"

"మా పని పూర్తయినదాకా!"

"ఆటుపైన నన్ను వదిలేస్తారా?"

కామరాజు వ్యంగ్యంగా నవ్వాడు.

"నిన్ను వదలం! నువ్వు బయటకెళ్తే నా గురించి

వాగుతావు" అన్నాడు కామరాజు.

"అయితే నన్నేం చేస్తావు?"

"నువ్వు ముఖ్యమంత్రి సెక్యూరిటీగార్డువిగా! అతడు పైకి వెళ్ళినపుడు నిన్నూ అతడితో పంపుతాం!" అన్నాడు కామరాజు.

పేట్లును అతడు అమాంతంగా కామరాజువైపు విసిరాడు.

చటుక్కున కామరాజు పిస్టల్ని బయటకుతీసి అతడి వైపు గురి పెట్టాడు.

"పిచ్చివేషాలేస్తే చస్తావు! చేతులెత్తి కూర్చో!" అరిచాడు కామరాజు.

దేవర్ వెనక్కి జరిగాడు. చేతులెత్తి సోఫాలో కూర్చున్నాడు.

"మిస్టర్ నన్ను వదిలేయి. నా తల్లికి కళ్ళులేవు. నేను లేకుండా ఆమె బతకలేదు" దేవర్ వేడుకున్నాడు.

"నా కూతుళ్ళను చూడకుండా నేనుండలేనని ఒకప్పుడు నే ననుకున్నాను. ముఖ్యమంత్రి షూట్ చేయించి నా కూతుళ్ళిద్దర్నీ చంపించాడు. వాళ్ళు పోయినా నేనింకా బతికే ఉన్నాను. నీ తల్లి కూడా నాలాగే బతికి వుంటుంది!" అన్నాడు కామరాజు.

దేవర్ జవాబివ్వలేదు. ఏం చెప్పినా అతడు వినడు. అతడితో మాట్లాడ్డం లాభించదు!

కామరాజు బయటకు కదిలాడు. తలుపు మూసి తాళం వేశాడు.

ఆనాటి రాత్రి తన డ్యూటీ అయ్యాక రవి యింటికి చేరుకున్నాడు. మామూలు దుస్తులు ధరించి అతడు రహస్యంగా కామరాజు యింటికి వెళ్ళాడు.

కామరాజు అతటివైపు నవ్వుతూ చూశాడు.

"రేపు ఇండిపెండెన్స్ డే! ముఖ్యమంత్రి ఫ్లాగ్‌ను పైకి పంపే సమయంలో అతడిని నువ్వు పైకి పంపేయాలి" అన్నాడు కామరాజు.

"మీరు భయపడకండి. అంతా అనుకున్న ప్రకారం జరుగుతుంది" అన్నాడు రవి.

కామరాజువైపు చూశాడతను. పిశాచంలా ఉన్నాడతను. పగ అతడి హృదయంలో, కళ్ళలో మండుతోంది!

"నువ్వు యిక్కడకు రావడం యెవ్వరూ చూడ లేదుగా?"

"ఎవ్వరూ చూడలేదు."

కామరాజు లేచాడు. అతడితో కరచాలనం చేశాడు.

"రవీ, రేపు ఈపాటికి మనం షాంపేన్ తాగుతూ ఉంటాం" అన్నాడు కామరాజు.

"తాగడానికి నేనుండను. మీరే తాగాలి" అన్నాడు రవి.

అతడికి బైబై చెప్పి రవి వెళ్ళిపోయాడు. ఆటోలో దేవర్ యింటికి చేరుకున్నాడు.

"మీకోసమే చూస్తున్నా" అంది కాంతమ్మ.

"ఏమిటి సంగతి?" అడిగాడు రవి.

"నేను యింటికి పోవాలి. నా కూతురి ఆరోగ్యం బాగా లేదు."

"వెళ్ళిరా" అన్నాడతను.

కాంతమ్మ వెళ్ళిపోయింది. అతడు తల్లి గదిలోకి వెళ్ళాడు. ఆమె నిద్రపోతోంది. మౌనంగా అతడు తన గదికి చేరుకున్నాడు.

ఇండిపెండెన్స్ డే!

ముఖ్యమంత్రి విజయచంద్రన్ వెనకే రవి నిలబడి ఉన్నాడు. ఫ్లాగ్ హోయిస్టింగ్ కార్యక్రమం సాగుతోంది.

మంత్రులందరూ లైనులో నిలబడి ఉన్నారు. ఫుల్ సూట్‌లో ఉన్న కామరాజు దూరంనుంచి ప్రజలమధ్య నుంచి, రవివైపు డేగలా చూస్తున్నాడు—

కామరాజు వేళ్ళతో సౌజ్ఞ చేయగానే తను షూట్ చేయాలి. రవి ఆలోచిస్తున్నాడు.

ముఖ్యమంత్రి విజయచంద్రన్ నవ్వుతూ తాడు కొన పట్టుకున్నాడు. కామరాజు వేళ్ళతో సౌజ్ఞ చేశాడు.

రెండుసార్లు రవి పిస్టల్ భయంకరంగా మ్రోగింది.

"మీ రిక్కడే వుండండి" అని విజయచంద్రాన్ని హెచ్చరించి రవి పరుగెత్తాడు.

నడిచిపోతున్న కామరాజును బలంగా పట్టుకున్నాడు.

ముఖ్యమంత్రి, యితర మంత్రులు, పోలీసు ఆఫీసర్లు అక్కడకు వెళ్ళారు. కామరాజు కోటుజేబులో వున్న పిస్టల్ని రవి బయటకు లాగాడు. ముఖ్యమంత్రికి చూపించాడు.

"ఈయన మీ వైపు పిస్టల్ గురిపెట్టడం చూసి గాలిలోకి షూట్ చేశాను" అన్నాడు రవి.

"కామరాజుగారా?" అన్నాడు ముఖ్యమంత్రి.

"మీ సెక్యూరిటీగార్డు చెప్పింది నిజంకాదు. నేను మిమ్మల్ని యెందుకు చంపుతాను?" అన్నాడు కామరాజు.

రవి ముఖ్యమంత్రివైపు వినయంగా చూశాడు.

"దేవర్, యేదేనా చెప్పాలా?" అడిగాడు ముఖ్య మంత్రి.

"నేను దేవర్‌ని కాను, సార్. దేవర్‌కీ నాకూ బాగా పోలికలు వున్నాయి. దేవర్‌ని ఖైదీ చేసి, అతడి స్థానంలో నన్ను ప్రవేశ పెట్టాడొక వ్యక్తి. మిమ్మల్ని చంపమన్నాడు."

"ఎవరా వ్యక్తి?"

"ఆయనే! కామరాజు గారు! నేను మిమ్మల్ని చంపడం లేదని గ్రహించి తనే పిస్టల్ని మీ వైపు తిప్పారు. అదే క్షణంలో నేను షూట్ చేశాను. ఆయన పిస్టల్ని జేబులో పడేసుకుని పోతూంటే పట్టుకున్నాను" అన్నాడు రవి.

"దేవర్ యెక్కడున్నాడు?" అడిగాడు ముఖ్య మంత్రి.

"ఆయన యింట్లో" అన్నాడు రవి.

"దేవర్ నా యింట్లో లేడు! అతడిని చంపి నా తోటలో పాతేశాను. అటు పైన యిక్కడకు వచ్చాను. నన్ను నమ్మించి ఈ దుర్మార్గుడు నాకు ద్రోహం చేశాడు" అన్నాడు కామరాజు.

కొందరు పోలీసు ఆఫీసర్లు కామరాజును జీప్‌లో యెక్కించుకుని వెళ్ళిపోయారు.

ముఖ్యమంత్రి రవివైపు చూశాడు.

"నీ పేరు?"

"రవి, సార్."

"మరో సెక్యూరిటీ గార్డును నియమించిన దాకా నువ్వు అదే పదవిలో వుండు" అన్నాడు ముఖ్యమంత్రి.

ఇండిపెండెన్స్ డే కార్యక్రమం పూర్తయింది. జండా

జయప్రదంగా ఎగురుతోంది!

ముఖ్యమంత్రి విజయచంద్రన్ తన కారులో కూర్చున్నాడు. తలుపు మూసి రవి ముందు సీటుమీద కూర్చున్నాడు.

పోలీసు కమీషనర్ కరీమ్ కారు దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"తోటలో తవ్వి దేవర్ శవాన్ని బయటకు తీయించాం. కామరాజును అరెస్టు చేశాం!" అన్నాడతను.

కారు కదిలింది. ముఖ్యమంత్రి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

"రవీ!" పిల్చాడతను.

వెనక్కి తిరిగాడు.

"ఇంతకు ముందే దీన్ని గురించి నువ్వు ఎందుకు చెప్పలేదు?"

"ఆయన యేం చేస్తాడో అని భయపడ్డాను."

"పోలీసులు నిన్నూ అరెస్టు చేస్తారు. ఆ కేసు ముగిస్తే నా పెర్సనల్ సెక్యూరిటీ గార్డుగా వుండొచ్చు. కాని నువ్వు ఒక సేవ చెయ్యాలి."

"ఏమిటో చెప్పండి!"

"తన కొడుకు పోయాడని తెలిస్తే దేవర్ తల్లి గుండె బాదుకుని చస్తుంది. ఆమె యెంతో కాలం బతికుండదు. అంతవరకూ ఆమె కొడుకులా నటించి, ఆమెకు ఆనందాన్ని యివ్వు."

"అలాగే, సార్" అన్నాడు రవి.

ముఖ్యమంత్రి నవ్వుతూ రవితో కరచాలనం చేశాడు.

40

"గాడ్ బ్లెస్ యు!" అన్నాడు ముఖ్య మంత్రి.

తారురోడ్డుమ్మట కారు దూసుకుపోయింది. ఇంటిముందు కారు ఆగింది. ముఖ్యమంత్రి దిగాడు.

ఎస్. పి. సుందరం రవి చెయ్యి పట్టుకున్నాడు.

"నిన్ను అరెస్టు చేస్తున్నాం" అన్నాడు సుందరం.

"మీ యిష్టం" అన్నాడు రవి నవ్వుతూ.

—:అ యి పో యిం ది:—